క్లుప్తంగా

శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో ప్రత్యేక పూజలు

కొత్తగూడెంటౌన్: జూలై 23 నుంచి జరగనున్న నవమ వార్షికోత్సవ పూజలను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం శ్రీచండీ సర్వజ్ఞ పీఠం వేదపండితులు దండిబట్ల రామాంజన కుమారశర్మ ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి శ్రీనగర్ కాలనీలోని శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సుజాతనగర్: అభివృద్ధి నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తిచేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నిమ్మలగూడెం గ్రామంలో రూ.60 లక్షలతో చేపట్టిన సీసీ రహదారులు, రూ.31 లక్షలతో చేపట్టిన పంప్ హౌస్ నిర్మాణాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, డీఈ శివయ్య, ఏఓ నర్మద, ఎలక్ట్రికల్ ఏఈ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ పంచాయతీ కార్మికులకు, రామాంజనేయ కాలనీ విశ్రాంత సింగరేణి ఉద్యోగి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో దాతలు నాగ వెంకటశాస్త్రి, జనయిత్రి ఆర్థిక సాయంతో నూతన దుస్తులు, నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, లగడపాటి రమేష్, వంశీ, శర్మ, బత్తుల కృష్ణయ్య, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొత్తగూడెంటౌన్: రామవరం సీఆర్పీ క్యాంపునకు చెందిన ఆటోడ్రైవర్ గుబ్బల సతీష్ ఇటీవల ఓ ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. రెండుకాళ్లు తొలగించాలని వైద్యులు తెలిపారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం జర్నలిస్టు గండికోట కిరణ్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జూలూరుపాడు: అనంతారం గ్రామానికి చెందిన పూనెం వెంకన్న, కంగాల నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. వెంకన్న కుటుంబానికి రూ.5,000, నాగమ్మ కుటుంబానికి రూ.3,000 అందజేశారు. కార్యక్రమంలో కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, బండారు పుల్లారావు, కల్తి హనుమంతు, కుంజా సతీష్, రేపాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుంజ కృష్ణ సోదరుడు బాలకృష్ణ దశదిన కర్మలకు గ్రామపంచాయతీ కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: ఇసుక అక్రమ రవాణా కోసం చెక్‌డ్యామ్ కరకట్టకు గండిపెట్టి ధ్వంసం చేశారని ఇరిగేషన్ ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కథనం.. రంగాపురం సమీపంలోని కిన్నెరసాని వాగులో నిర్మించిన చెక్‌డ్యామ్ కరకట్టకు గండిపెట్టి అందులో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా సాగిస్తున్నారని భూక్యా వీరుపై శనివారం ఇరిగేషన్ ఏఈ టి.నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీరాములు తెలిపారు.

టిప్పర్ డ్రైవర్‌పై..

పాల్వంచరూరల్: రోడ్డుపై నిలిపిన టిప్పర్ వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటనపై పోలీసులు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మణుగూరుకు చెందిన కుతుంబాక వెంకటరమణ ఈనెల 11న రాత్రి సమయంలో ఖమ్మం నుంచి మణుగూరుకు కారులో వెళ్తున్నాడు. ఈక్రమంలో పాల్వంచ మండలం నాగారంకాలనీ వద్ద హైవే రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆస్పత్రిలో చికిత్స అనంతరం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టిప్పర్ డ్రైవర్ లాకవత్ సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు తెలిపారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని, అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న, అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న వారిపై చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్డు అదుపూ లేకుండా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏటా విద్యార్థి సంఘాలు ఈ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి తీరు మారడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని, ప్రతీ ప్రైవేటు పాఠశాలలో 25శాతం ఉచిత విద్యను పేద విద్యార్థులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజిత్, వంశీ, రాణధీర్, వినయ్, సృజన్ పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



- వేములవాడ, కొండగట్టు ప్రాంతాలకు
- కొత్తగూడెం డిపో నుంచి బస్సు సర్వీసు



కొత్తగూడెం బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు

సండే స్పెషల్

చుంచుపల్లి: కొత్తగూడెం పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం ఆర్టీసీ యాజమాన్యం పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ప్రారంభించింది. సంస్థ అభ్యున్నతికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ సంస్థలో ఇప్పటికే కొరియర్, కార్గో సేవలు విజయవంతంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అటు మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. తాజాగా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ.. సంస్థకు మరింత ఆదాయం వచ్చేలా ప్రయోగాత్మకంగా పేరొందిన పుణ్యక్షేత్రాల దర్శనం టూర్ – టూర్ ప్యాకేజీలను ప్రారంభించింది. కొత్తగూడెం డిపో పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి ఎంపిక చేసిన ఆలయాలకు ఈ ప్రత్యేక బస్సును నడుపుతోంది. ఈ బస్సును వారం వారం నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం డీలక్స్ బస్సును అందుబాటులో ఉంచారు. తక్కువ చార్జీలతో భక్తులను ఆలయాలకు తీసుకెళ్లి, తిరిగి గమ్యస్థానాలకు తీసుకరానున్నారు. ఒకవేళ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు కలిసి ఆలయాలు, విహార యాత్రలు, శుభకార్యాలకు వెళ్లాలనుకుంటే వారి కోసం ఆయా గ్రామాలు, కాలనీలు వద్దకే నేరుగా బస్సులను పంపనుంది. ఒకవేళ మొత్తంగా 36 మంది ప్రయాణికులు సిద్ధంగా ఉంటే, కోరుకున్న పుణ్యక్షేత్రాలకు ఏ రోజైనా ఆర్టీసీ వారి కోసం బస్సులు నడపనుంది. ఇందుకుగాను ప్రయాణికుల నుంచి కేవలం బస్ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నారు. ఇక ప్రయాణికుల దర్శనం, అల్పాహారం, భోజనాలు ఇతరత్రా ఖర్చులు వంటివి ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇప్పటికే కొత్తగూడెం డిపో పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

కొత్తగూడెం నుంచి డీలక్స్ బస్సు...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) ప్రయాణికులను ఆకర్షించే ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. ఇప్పటికే నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన టీజీఆర్టీసీ మరో అడుగు ముందుకు వేసింది. దైవదర్శనాలకు వెళ్లే భక్తులను ఆకట్టుకునేందుకు కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో ఒక్కరోజు టూర్‌ను తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా కొత్తగూడెం డిపో నుంచి రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వెసులుబాటు కల్పించింది తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ. ఇందుకోసం జూన్ 27నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. కొత్తగూడెం డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ఒక్కరోజు టూర్ ప్యాకేజీ డీలక్స్ బస్సును శుక్రవారం రాత్రి 8 గంటలకు కొత్తగూడెం బస్టాండ్ నుంచి ప్రారంభించారు. ప్రయాణికుల దర్శనం కోసం ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాలకు నడుపుతున్నారు. ప్రయాణికులు ఈ రెండు పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారి దర్శనం కూడా ఉంటుంది. ఇందుకు చార్జీలు కొత్తగూడెం నుంచి పెద్దలకు రూ.1,310, పిల్లలకు రూ.660.. ఇల్లెందు నుంచి అయితే పెద్దలకు రూ.1,280, పిల్లలకు రూ.650 చొప్పున ఉంటుందని తెలిపారు. అదేవిధంగా జూలై 8న అరుణాచలగిరికి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నారు. ఈ టూర్‌లో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుంది. అరుణాచలగిరికి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది. వివరాలకు 9959225959, 7382858008, 7382858258, ఇల్లెందు 9346728893 నంబర్లలో సంప్రదించాలని కొత్తగూడెం ఆర్టీసీ అధికారులు వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు వివిధ పుణ్య క్షేత్రాలను కొత్తగూడెం నుంచి ఆర్టీసీ బస్సును నడుపుతున్నాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన డీలక్స్ బస్సును అందుబాటులో ఉంచాం. మొదటి టూర్ బస్సు శుక్రవారం రాత్రి వేములవాడకు వెళ్లింది. ఈ టూర్ బస్సు ప్రతీ వారం నడుపుతాం. ఎవరైనా ప్రత్యేకంగా బస్సు కావాలన్నా ఏర్పాటు చేస్తాం.

– ఎం.దేవేందర్ గౌడ్, డిపో మేనేజర్, కొత్తగూడెం

గ్రామ సంఘాలను తీర్చిదిద్దాలి



శిక్షణకు హాజరైన గ్రామసంఘాల ప్రతినిధులు

ఇల్లెందురూరల్: నూతనంగా ఎంపికైన ప్రతినిధులు గ్రామ సంఘాలను సమర్థవంతంగా నిర్వహించి సభ్యుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎం దుర్గారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామసంఘాల నూతన బాధ్యులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సభ్యులుగా, ప్రతినిధులుగా పొదుపు సంఘాలను చక్కగా తీర్చిదిద్దుకున్నారని, ఇకమీదట తమ సంఘంతోపాటు గ్రామంలోని ఇతర సంఘాల పనితీరు నూతన ప్రతినిధులు మెరుగుపర్చాలన్నారు. దీనికోసం సంఘాల నిర్వహణ, రుణాల మంజూరు, సంక్షేమ పథకాల సద్వినియోగం వంటి అంశాలపై సెర్ప్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. తోశం శారద, మద్దోజు సురేఖ, మంగ, శిక్షకులు రమాదేవి, రమ, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందు/ఇల్లెందురూరల్: అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల కలిగే దుష్పలితాలు, అక్రమ రవాణాను అరికట్టడంపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉమాశంకర్, ఉపాధ్యాయులు, ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలి

ఇల్లెందు: ఇల్లెందు పూసపల్లి ఓసీ పరిధిలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులను సింగరేణి ఆదుకోవాలని నిర్వాసిత కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఇల్లెందులో పర్యటించిన సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును అఖిలపక్ష కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే చేసిన ఇళ్లకు పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు సారయ్య, నజీర్, జే.వెంకటేశ్వర్లు, గోచికొండ సత్యనారాయణ, సురేందర్, వడ్ల శ్రీనివాస్, ఎట్టి హరికృష్ణ, రమేష్, క్లింట్, రాజు, మహేష్, మధు, లాలు, విజయ్, మొగిలి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేసిన ‘ఇఫ్టూ’

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మె నోటీసును శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రుకు ఇఫ్టూ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ... కొత్తగూడెం ఏరియాలో త్వరలో ప్రారంభం కానున్న వీకే-7 ఓసీలో మొదటి అవకాశం స్థానిక నిరుద్యోగులకు ఇవ్వాలని, సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ పెంచాలని, పర్మనెంట్ కార్మికులకు ప్రాఫిట్ బెనిఫిట్స్ పెంచాలని అనేక సమస్యలపై జూలై 9న సమ్మె జరుగుతుందని ఈ సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్పందించిన డైరెక్టర్(పా) సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రీజియన్ కార్యదర్శి ఎస్.సంజీవ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకన్న పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..

జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బీఎంఎస్ మినహా కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాని దేశవ్యాప్తంగా 50 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభాత్వానికి ఈ సమ్మెతో కనువిప్పు కలగాని చెప్పారు. 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను వివరించారు. వెంకట్, రమణమూర్తి, రాజారెడ్డి, విజయగిరి శ్రీనివాస్, త్యాగరాజన్, విశ్వనాథం, కందగట్ల సురేందర్, కాపు కృష్ణ, రాములు, గట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు



కొత్తగూడెంఅర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగాచార్యులు అన్నారు. శనివారం పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారని కొనియాడారు. సతీష్, సంతోష్, నవీన్, ప్రసాద్, నరేందర్, సుమన్, శంకర్ పాల్గొన్నారు.

ఇల్లెందు: మాజీ ప్రధాని పీవీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సుదర్శన్ కోరీ, జాఫర్, ఇబ్రహీం, మహమూద్, అక్తర్, పర్రె శ్రీనివాస్, సతీష్, శ్యామ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి..

జూలూరుపాడు: విద్యార్థుల ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. మూడేళ్లుగా సుమారు రూ.6 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..



విజయలక్ష్మీనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరానికి రూ.12వేల చొప్పున రైతు భరోసా కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలో అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పెట్టుబడిగా రైతు భరోసా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన విస్తీర్ణంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, హైసింగ్ ఏఈ స్వాతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ యాజమాన్యానిదే బాధ్యత



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: కేటీపీఎస్ 9వ యూనిట్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఆర్టిజన్ ముద్రబోయిన సుబ్బారావు సిలెండర్ పేలి మృతి చెందిన ప్రమాదానికి కేటీపీఎస్ యాజమాన్యమే బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుబ్బారావు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా నిపుణుల పర్యవేక్షణలో చేయాల్సిన పనులను ఆర్టిజన్ కార్మికుల చేత చేయించడం, కమర్షియల్ సిలిండర్లు వినియోగించే చోట డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడం వలన ప్రమాదం జరిగిందన్నారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేష్, భూక్యా రవినాయక్, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

‘పిండ ప్రదానం’ విజయవంతం చేయండి..



మాట్లాడుతున్న రాజుగౌడ్

పాల్వంచ: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామం సీతారామ ప్రాజెక్ట్ పంపు హౌజ్ వద్ద కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, సొసైటీ ఉపాధ్యక్షుడు కనకేష్ పటేల్, కాలేరు సింధు తపస్వీ పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాద్రి జిల్లాను సస్యశ్యామలం చేయాలని, రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో జిల్లాలోని అమ్మవారిపల్లి వద్ద సీతారామ ప్రాజెక్టును ప్రారంభించి రూ.18 వేల కోట్లతో 90శాతం పనులు పూర్తి చేసిందని, మిగిలిన పనులను అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు పూసుగూడెం హౌజ్2 వద్దకు వచ్చి సీతారామ ప్రాజెక్టును ప్రారంభించి, తర్వాత పనులు నిలిపివేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో సంగ్లోత్ రంజిత్, హర్షవర్ధన్, రాఘవేంద్ర, శోభన్, పుల్లయ్య, లోహిత్‌సాయి, మురళీ కృష్ణ, సాయి, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘కార్పొరేట్’కు వ్యతిరేకంగా పోరాటం



శిక్షణ తరగతులకు హాజరైన నాయకురాళ్లు

సింగరేణి(కొత్తగూడెం): మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలను ఐక్యం చేయాలని మత రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల్లోకి తీసుకరావాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రజా సమస్యలు వెలుగులోకి రాకుండా, వాటిపై ఎవరూ ప్రశ్నించకుండా బ్రిటిష్ పాలనా విధానాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోందన్నారు. ప్రస్తుత రాజకీయాలు వ్యాపారం అయిపోయిన సందర్భంలో కులమత రాజకీయాలు ముందుకొస్తున్న నేపథ్యంలో స్వచ్ఛమైన రాజకీయాల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలని, రాజకీయ విలువలు బతికే ఉన్నాయని ప్రజలకు నమ్మకం కల్పించాలన్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అంగీకారం

సింగరేణి(కొత్తగూడెం): 2013 – 2016 వరకు సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించిన జేఎంఈటీలు వివిధ కారణాలతో డిస్మిస్ అయిన వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగం ఇవ్వటానికి యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో అంతకంటే ముందు జరిగిన 50వ నిర్మాణాత్మక సమావేశంలోని పలు అంశాలను చర్చించడం జరిగిందని, వీటిలో ప్రధానంగా అలియాస్ మారు పేర్లలో ఉన్న కేసులను సెటిల్‌మెంట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరాగా.. కులం, ఇంటి పేర్లు వంటి కేసులను పక్కన పెట్టి మిగతా కేసులను పరిష్కరించి వారికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో వంగా వెంకట్, రమణమూర్తి, గట్టయ్య, సందిరి శ్రీనివాస్, కత్తెర రాములు, క్రిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్టడీ సర్కిళ్లకు ఆదరణ

- ఒక్కొక్కరికి ఒక్కో క్యాబిన్ ఏర్పాటు
- పోలీసు అభ్యర్థులకు ఉచితంగా ఈవెంట్స్ ప్రాక్టీస్
- ఆరోగ్యశాఖలో నోటిఫికేషన్ విడుదలతో చేరికలు
- కొత్తగూడెంలో రెండు సెంటర్ల ఏర్పాటు



స్టడీ హాల్‌లో చదువుకుంటున్న అభ్యర్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రెండు గ్రంథలయాలు... పాఠకులు, విద్యార్థులు, యువతకు సేవలందింస్తున్నప్పటికీ ప్రైవేటు స్టడీ సెంటర్లకు కూడా అదే స్థాయిలో ఆదరణ పెరుగుతోంది. గ్రంథలయాలకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం దాదాపు 300 – 400 మంది అన్ని వర్గాలవారు వచ్చి దిన, వార, పక్ష పత్రికలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతుంటారు. ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. కాని పోటీ ప్రపంచంలో యువత మరింత అత్యాధునిక సదుపాయాలకు ఆకర్షితులైతున్న నేపథ్యంలో వారికి తగ్గట్టుగా నిర్వాహకులు కూడా అధునిక సౌకర్యాలతో స్టడీ సెంటర్లు ఏర్పాట్లు చేసి కొంత ఫీజు తీసుకుంటున్నారు. అయినప్పటికీ ప్రశాంతత, మొబైల్ వాడకానికి ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయడంతో యువత, పోటీ పరీక్షలు సిద్ధం అయ్యేందుకు అక్కడ చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్తగూడెంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో, గణేష్‌టెంపుల్ ఏరియాలలో రెండు స్టడీ హాల్స్ నడుస్తున్నాయి. ఇందులో స్త్రీ, పురుషులకు విడివిడిగా ఒక్కొక్కరికి ఒక్కో క్యాబిన్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ఇవి ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఇక్కడ అన్ని ఏర్పాట్లతో అడ్మిషన్ పొంది, ప్రతీనెల రూ.899 చెల్లించాలి. ప్రస్తుతం ఒక్కో సెంటర్‌లో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువత 80 – 100 మంది ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆరోగ్యశాఖలో నోటీఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థుల సంఖ్య పెరగవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.

సదుపాయాలు ఇలా...

పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థుల కోసం కొత్తగూడెంలో రెండు స్టడీ సెంటర్లు ఉన్నాయి. వాటిల్లో చదువుకునేందుకు ఎవరి పుస్తకాలు వారూ తెచ్చుకోవాలి. అన్ని దినపత్రికలు మాత్రం అందుబాటులో ఉంచుతున్నారు. ఉచిత హై స్పీడ్ వైఫై, వ్యక్తిగత మొబైల్ చార్జింగ్ పాయింట్లు, సీసీ కెమెరా భద్రత, తాగునీటి సదుపాయం, పోలీసు అభ్యర్థులకు ప్రతీ ఆదివారం పరీక్షలు, ఉచిత ఈవెంట్స్ ఉంటాయి. దీంతో అభ్యర్థులు ప్రైవేటు స్టడీ సెంటర్లపై మక్కువ చూపుతున్నారు.


ప్రశాంతంగా చదువుకోవచ్చు..



కొత్తగూడెం బస్టాండ్‌కు సమీపంలోని స్టడీ హాల్‌లో పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అవుతున్నాను. ప్రశాంతంగా చదివేందుకు అనుకూలంగా ఉంది. ప్రతి నెల డబ్బులు చెల్లించినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదుకోగలుగుతున్నాను. రానున్న డీఎస్సీకి ప్రిపరేషన్ అవుతున్నాను.

– జానీ, కొత్తగూడెం

అన్ని సౌకర్యాలు ఉన్నాయి...



కొత్తగూడెంలోని స్టడీ హాల్స్‌కు చుట్టు పక్కల మండలాలను అభ్యర్థులు ఎక్కువగా వస్తున్నారు. అందుకు తగ్గట్టుగా నిర్వాహకులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోలీసు అభ్యర్థులకు ఉచిత ఈవెంట్స్‌కు కూడా సహకరిస్తున్నారు. వైద్యశాఖ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వీటికి ఆదరణ పెరిగింది.

– అఖిల్, కొత్తగూడెం